

ఖోఖో పోటీల్లో జిల్లా జట్ల విజయం
రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో అండర్–19 పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు విజయం సాధించాయి. కర్నూలు జిల్లాలో ఈ పోటీలు జరిగాయి.
-10లో..



జిల్లావ్యాప్తంగా వర్షాలు
జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సరాసరి 32.6 మి.మీగా నమోదైంది.
-10లో..

గరిష్టం/కనిష్టం
29.6/24

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి సురేష్ పర్యటన



పెద్దదోర్నాల: మండల కేంద్రంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కర్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మంత్రి సురేష్ చేతుల మీదుగా సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల ప్రజలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

26న మాగుంట సుబ్బరామరెడ్డి జయంతి

ఒంగోలు సెంట్రల్: ఈనెల 26 దివంగత మాగుంట సుబ్బరామ రెడ్డి 76వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి తెలిపారు. 26 ఉదయం పది గంటలకు మాగుంట కార్యాలయంలో మాగుంట సుబ్బరామ రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం అభిలాష్ హోల్ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్‌లో, అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మాగుంట సుబ్బరామ రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమంలో మాగుంట సుబ్బరామ రెడ్డి కుమారుడు మాగుంట విజయబాబు పాల్గొననున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు, మాగుంట అభిమానులు పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

29న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం ఈ నెల 29వ తేదీ నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం పాత జిల్లా పరిషత్ సమావేశ హాల్లో జరుగుతుందన్నారు. అధికారులందరూ సరైన నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

రాచర్ల రైల్వేగేటు మూడు రోజులు మూత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రైల్వే గేటును ఈ నెల 27వ తేదీ వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే డబ్లింగ్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతానికి రైల్వే గేటును మూతవేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాచర్ల గేటు నుంచి పాములపల్లె గేటు నుంచి పట్టణంలోకి రావాల్సిందిగా కోరారు. బస్సులు మాత్రం సత్తేలి గ్రామంలోని అండర్ బ్రిడ్జి నుంచి గిద్దలూరులోకి ప్రవేశించాల్సిందిగా కోరారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పొగాకు బ్యారన్ల తరలింపునకు అనుమతి

టంగుటూరు: భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వ శాఖ రాష్ట్రంలో పొగాకు బోర్డు పరిధిలోని ఉత్తర ప్రాంత నల్లరేగడి నేలల్లో (ఎన్‌బీఎస్)ని పొగాకు బ్యారన్లను ఇతర ప్రాంతాలకు (ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్) తరలించుకునేందుకు అనుమతి మంజూరు చేసిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో కాలంగా వర్జీనియా పొగాకు రైతుల విజ్ఞప్తిని కేంద్రం పరిశీలించి ఈ అవకాశం కల్పించిందని చెప్పారు. రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు రైతుకు గత సీజన్ స్వర్ణయుగం.. చరిత్రలో ఎన్నడూలేని విధంగా మార్కెట్‌లో ధరలు పలకడంతో రైతులు లాభాలు చవిచూశారు. అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండడంతో బ్యారన్‌కు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. ఫలితంగా ఈ ఏడాది ఈ పంటను పెద్ద ఎత్తున సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో నారుకు మంచి డిమాండ్ ఏర్పడింది. గత ఏడాదితో పోల్చుకుంటే నారు ధరలు రెట్టింపయ్యాయి. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాట్లు ఊపందుకున్నాయి.



మద్దిపాడు మండలంలో వర్షాలకు ఊపిరి పీల్చుకున్న పొగ తోట

- వర్షాలతో ఊపందుకున్న పొగాకు నాట్లు
- ఉత్తమ యాజమాన్యంలో నాణ్యమైన పొగాకు దిగుబడి
- రబీలో ఇప్పటికే 29,190 ఎకరాల్లో సాగు
- పొగ నారుకు మంచి డిమాండ్
- పెరిగిన కౌలు, బ్యారన్ ధరలు

సాగుజోరు..

ఒంగోలు సెంట్రల్: పొగాకు చరిత్రలోనే గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ సంవత్సరం రైతులకు ధరలు వచ్చాయి. రీజియన్ పరిధిలోని 11 ప్లాట్ ఫాంలలో నాణ్యమైన పొగాకు కేజీ ధర అత్యధికంగా రూ.289 పలికింది. మీడియం, లోగ్రేడ్ వంటి పొగాకుకు కూడా గరిష్టంగా కేజీ రూ.275 వరకు పలికింది. పొగాకు కొనుగోళ్లకు అనుమతిచ్చింది 87.9 మిలియన్ కేజీలకు కాగా, 122.8 మిలియన్ కేజీల కొనుగోళ్లు జరిగాయి. పొగాకుపై అత్యధిక లాభాలు రావడంతో దీనిని సాగు చేసేందుకు రైతుల్లో ఆసక్తి పెరిగింది. దీంతో బ్యారన్ అద్దె గతంలో రూ.50 వేల నుంచి రూ.60 వేల మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.1.50 లక్షలకు పెరిగింది. పొలం కౌలు గతంలో ఎకరానికి రూ.15 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పెరిగింది. అలాగే పొగనారుకు సైతం మంచి డిమాండ్ ఏర్పడింది. గతంలో మూట (ఐదు నుంచి ఆరువేల మొక్కలు) రూ.1000 నుంచి రూ.1500 వరకూ విక్రయించగా నేడు రూ.3 వేలకు పెరిగింది.

ఊపందుకున్న సాగు..

జిల్లాలో పొగాకు సాగు ఊపందుకుంది. జిల్లాలో గత సంవత్సరం రబీలో 68,362 ఎకరాలు సాగు కాగా ప్రస్తుతం 29,190 ఎకరాల్లో సాగైంది. రీజియన్ పరిధిలో 26,600 మంది రైతులకు 20,200 బ్యారన్‌లలో, 1,25,687 ఎకరాల్లో అధికారిక ఉత్పత్తి పరిమాణం 77 మి.కేలుగా ప్రస్తుతం నిర్ణయించారు. కొన్ని ప్రాంతాల్లో ముందస్తుగా నాటిన వాటిల్లో సేద్యం, గత వారంలో కురిసిన వర్షాలకు నాట్లు ఊపందుకున్నాయి. నాట్ల దశ నుంచే తగిన జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి పొందే వీలుంటుందని పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు రైతులకు పలు సూచనలు చేశారు. పెన్సిల్ మందం కలిగిన నాణ్యమైన నారును ఎంపిక చేసుకుని వరుసల మధ్య 70 సెం.మీ, మొక్కల మధ్య 50 సెం.మీ దూరం ఉండేలా నాటుకోవాలి. బోదెలు చేసి నాటితే తుఫాన్ల సమయంలో మొక్కలు వడిలి పోకుండా ఉంటాయి.



అంతర సేద్యంలో మొక్కలను పైకి లేపుతున్న రైతు కూలీలు

నాటిన ఇరవై రోజుల తర్వాత మొక్కలు బాగా స్థిరపడ్డాక గొర్రుతో మొదటి అంతర సేద్యం చేయాలి. నాట్ల తర్వాత వర్షాలు పడకపోతే బెట్ట వాతావరణం ఉంటే ఒక తడి నీరు పెట్టుకోవచ్చు. నీటితో క్లోరైడ్ 50 పీపీఎం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి. తెగుళ్లు ఆశిస్తే బోర్డు అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు పిచికారి చేసుకోవాలి. క్రిమి సంహారక మందుల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని సూచిస్తున్నారు. పొగాకు పంట చుట్టూ ఎర్ర పంటలైన ఆముదం, బంతి, అవరోధ పంటలైన జొన్న, మొక్కజొన్న వేయడం ద్వారా చీడ పీడల ఉధృతిని కొంత మేర అరికట్టవచ్చు. ఎర్ర నేలల్లో నాట్లకు ముందే దుక్కిలో ఎకరానికి 800 కిలోల పశువుల ఎరువుతో పాటు అమ్మోనియం సల్ఫేట్ 60 కిలోలు, సూపర్ పాస్ఫేట్ 150 కిలోలు, ఎస్ఓపీ 50 కిలోలు వేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వర్షాలతో ఊపిరి పీల్చుకున్నాం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పొగనాట్లు వేసినవి బతికాయి. అంత సేద్యంపై దృష్టి సారించాం. ప్రస్తుతం ఉన్న వాతావరణం మళ్లీ నాట్లు వేసే వారికి కూడా ఉపయుక్తంగా ఉంది. పొగనారుకు మంచి డిమాండ్ ఉంది.

– గొల్లపూడి వీరయ్య, రైతు

పొగనారుకు డిమాండ్



వర్షాలు కురుస్తున్న తరుణంలో పొగనారుకు డిమాండ్ ఏర్పడింది. గతంలో మూట 1500 వరకు ఉన్న పొగనారు నేరు రూ.3 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వలతో పలు చోట్ల మొక్కలు చనిపోయాయి. దీంతో పొగనాట్లు మళ్లీ వేయాల్సి వస్తోంది.

– శరత్, కేవీ పాలెం

పొగనాట్లు ఊపందుకున్నాయి



తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో గత వారం, తిరిగి మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పంటలకు ఉపయుక్తంగా ఉన్నాయి. మంచి సస్యరక్షణ చర్యలు, నాణ్యమైన పొగాకు నారు ఎంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

అట్రాసిటీ పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్ పోర్టల్

ఒంగోలు టౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అట్రాసిటీ చట్టం, నిబంధనల అమలుకు సంబంధించి ఆన్‌లైన్ పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. ఏపీసీఎఫ్ఎస్ఎస్ ఈ విధానాన్ని అభివృద్ధి చేసింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ విడుదల చేసిన పోర్టల్ మాడ్యూల్ వివరాలు శుక్రవారం జిల్లాలకు చేరాయి. ఇందులో పోర్టల్ వినియోగం, లక్ష్యాలను స్పష్టంగా వివరించారు. ఏదైనా అఘాయిత్యానికి గురైన బాధితులు ఎవరైనా సరే, ఎక్కడి నుంచైనా సరే ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు స్వభావం ఆధారంగా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం వెళ్లిపోతుంది. ఉదాహరణకు ఎఫ్ఐఆర్, చార్జిషీట్, విచారణకు సంబంధించిన సమస్య ఏదైనా ఉంటే అది వెంటనే పోలీసు శాఖకు వెళ్లి పోతుంది. అదే కనుక రిలీఫ్‌కు సంబంధించిన ఫిర్యాదు అయితే రెవెన్యూ శాఖకు, రిలీఫ్, ప్రత్యేక రిలీఫ్‌కు సంబంధించి విచారణ లేదా మంజూరుపై ఫిర్యాదు అయితే సంక్షేమ శాఖకు సమాచారం వెళ్తుంది. కోర్టు కార్యకలాపాలు, తీర్పుల ఫిర్యాదులపై జ్యుడిషియల్ విభాగానికి సమాచారం ఇస్తారు. ఈ పోర్టల్‌లో పోలీసు డేటా అందుబాటులో ఉంచుతారు. తద్వారా ఎఫ్ఐఆర్ వివరాల కాపీతో పాటు చార్జిషీటు వివరాలను బాధితులు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు వారి లాగిన్ల ద్వారా పోర్టల్‌లోని ఫిర్యాదు స్టేటస్‌ను అప్డేట్ చేస్తూ ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉంటుంది. ఫిర్యాదు చేసిన తరువాత బాధితులకు సందేశం వస్తుంది. తదుపరి వారు అందుబాటులో ఉన్న లింక్‌తో స్టేటస్‌ను చూడవచ్చు. ఫిర్యాదుల స్టేటస్‌పై రిపోర్టులు జిల్లా కలెక్టర్లకు, హెచ్ఓడీ, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వారికి అందుబాటులో ఉంటాయి. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ప్రజలు పోర్టల్ సర్వీసును ఆధార్ నంబరు, మొబైల్ నంబరును వినియోగించి తమ ఫిర్యాదు స్టేటస్‌ను పరిశీలించుకోవచ్చని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రోడ్డు భద్రత నియమాలను పక్కాగా అమలు చేయాలని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన కనీస చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోలు ఇష్టానుసారంగా ఆపకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు ఆటో డ్రైవర్‌లకు, యూనియన్‌లకు అవగాహన కల్పించాలన్నారు. తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్ల నిర్వహణ ద్వారా ఏర్పడుతున్న ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించేందుకు నగరంలో ఫుడ్‌కోర్ట్‌ల నిర్వహణకు మూడు ప్రత్యేక ప్రాంతాలను గుర్తించి మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ఒంగోలు, పొదిలి, మద్దిపాడు, టంగుటూరు, శింగరాయకొండ, అద్దంకి, త్రిపురాంతకం తదితర ప్రాంతాల్లో పోలీసు, ఆర్అండ్‌బీ, రవాణా, జాతీయ రహదారుల శాఖల అధికారులు అధ్యయనం చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ప్రమాదాన్ని ఐ–రాడ్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డీటీసీ ఆర్ సుశీల, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, డీసీహెచ్ఎస్ మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, రవాణా శాఖ ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడిగా కన్న

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడిగా స్థానిక జీఎల్ఐ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు చేదూరి కన్న నియమితులయ్యారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన ఏపీ ఇండిపెండెంట్ పాస్టర్, బిషప్స్ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యేడిద జాన్సన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా కన్నను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కన్నను వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా అభినందించారు.



నియామక పత్రం అందుకుంటున్న కన్న

30న కొండపిలో మెగా జాబ్ మేళా

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణావృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఆర్.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో జోయాలుకాస్, హెటిరో డ్రగ్స్, వైఎస్‌కే ఇన్ఫోటెక్, ఆల్‌సెట్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, టీవీఎస్ ట్రెనింగ్ అండ్ సర్వీసెస్, ఎస్బీ కార్ప్స్, అమరరాజా బ్యాటరీస్, టాటా ఎలక్ట్రానిక్స్, లయం గ్రూప్ జపనీస్ ఆటోమొబైల్ కంపెనీ, డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ జియో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోకం, డి మార్ట్, ఎస్వీ ఫుడ్స్ ప్రై.లి తదితర 15 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్‌తోపాటుగా ఏదైనా పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు కనీస వేతనం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. స్కిల్ యూనివర్స్ వెబ్‌సైట్‌లో కానీ, మొబైల్ యాప్ ద్వారా కానీ తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 9988853335కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

కమనీయం..దేవదేవుని జలవిహారం



ఉభయదేవేరులతో లక్ష్మీ చెన్నకేశవస్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేపీ

- వైభవంగా చెన్నకేశవస్వామి తెప్పోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి పుష్కరిణిలో కార్తీక క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, ఉభయదాత శ్రీశైల దేవస్థాన ట్రస్టుబోర్డు సభ్యురాలు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ కుటుంబ సభ్యులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారిని ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి తెప్పోత్సవం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ పీ కేశవరావు, ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, అర్చకుల బృందం వేదమంత్రాలతో పూజలు నిర్వహించి హారతులు ఇచ్చి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి కార్తీకమాసంలో క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని ఉభయ దేవేరులతో రంగనాయక అలంకారంలో చెన్నకేశవ స్వామి వారు వెండి శేష వాహనంపై జలవిహారం చేస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల విద్యుత్ లైట్ల మధ్య కోనేటిలో విహరిస్తున్న చెన్నకేశవ స్వామివారిని భక్తులు తిలకించి తరించారు. స్వామి వారు పుష్కరిణిలో విహారం చేస్తుండగా భక్తులు దర్శించుకున్నారు. జై చెన్నకేశవా.. అంటూ ఆ ప్రాంతమంతా హోరెత్తింది. మహిళా భక్తులు పుష్కరిణి వద్ద కోలాటం చేశారు. తెప్పోత్సవానికి ముందు వర్షం కురవటంతో ఉత్సవానికి ఆటంకం వస్తుందేమోనని భక్తులు ఆందోళన చెందగా వరుణ దేవుడు శాంతించటంతో తెప్పోత్సవం ఘనంగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తదితరులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డి, ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, శివాలయం చైర్మన్ కేశవశర్మ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పలువురు కౌన్సిలర్లు చంద్ర, కే కృష్ణ, వనజాక్షి, డీ భాగ్యలక్ష్మి, పార్టీ ప్రధాన కార్యదర్శి బి.శేషయ్య, ఎంపీడీఓ చందన, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. పుష్కరిణిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా డీఎస్పీ జి వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో భద్రత చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో సీఐ భీమానాయక్, ఎస్సైలు కోటేశ్వరరావు రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్, సువర్ణ, డివిజన్‌లోని పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు, అగ్నిమాపక సిబ్బంది, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల మధ్య పుష్కరిణి వ్యూ



కోలాటం ఆడుతున్న భక్తులు



కోనేటిలో విహరిస్తున్న స్వామి వారి వద్ద ఉభయదాత డాక్టర్ కనకదుర్గ


జనగళం



నెరవేరిన సొంతింటి కల

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా చెప్పిన మాట ప్రకారం పేదలకు సొంతింటి కల నెరవేర్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేకసార్లు ఇంటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇల్లు మంజూరు చేయలేదు. వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే జగనన్న కాలనీల పేరుతో గ్రామాలనే నిర్మిస్తున్నారు. చింతలపాలెంలో జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పాటు, సొంత డబ్బులతో ఇల్లు కట్టుకున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– వేల్పుల ధనమ్మ, చింతలపాలెం, జరుగుమల్లి మండలం



చేయూతతో ఆర్థికాభివృద్ధి



వైఎస్సార్ చేయూత పథకం ఆర్థికంగా ఆదుకుంది. రూ.18,750 ఉచితంగా ఇవ్వటంతో పాటు బ్యాంక్ నుంచి రూ.56,250 రుణం ఇచ్చారు. మొత్తం రూ.75 వేలు నగదుతో కిరాణా షాపు పెట్టుకున్నాను. చిరు వ్యాపారస్తురాలిని అయ్యాను. కిరాణా వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాను. తరువాత రెండు సంవత్సరాలు కలుపుకుని రూ.37,750 చేయూత కింద అకౌంట్‌లో జమ చేశారు. కొంత అప్పులు కూడా తీర్చాను. చేయూత పథకం పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బి.నాగేంద్రమ్మ, అల్లూరు గ్రామం, కొత్తపట్నం మండలం

నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపు రేఖలు



నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి. ప్రైవేటుకి దీటుగా వసతులు కల్పించాం. పాఠశాలలో 427 మంది విద్యార్థులకు పాఠశాలలో నెలకొల్పిన ఆర్ఓ ప్లాంటు ద్వారా మినరల్ వాటర్ అందిస్తున్నాం. విద్యార్థులకు డిజిటల్ విద్య అందుతోంది. ముఖ ఆధారిత హాజరు వల్ల ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు వస్తున్నారు. విద్యాబోధన మెరుగు పడింది. మధ్యాహ్నం జగనన్న గోరు ముద్ద పెడుతున్నారు. ఏటా విద్యార్థులకు జగనన్న విద్యాకానుకతో పాటు పుస్తకాలు స్కూలు బ్యాగ్, టై, సాక్సు, యూనిఫాం, భోజన ప్లేట్ లు ఉచితంగా సమకూర్చుతున్నారు.

– ఎం.శ్రీనివాసరావు, టీచర్, జెడ్పీ హైస్కూల్, జరుగుమల్లి

విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి



గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. తొలుత వీటిని అనుసరించడం కాస్త ఇబ్బందిగా ఉన్నా, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల వైపు నుంచి ఆలోచిస్తే సంస్కరణల అమలు మంచిదనే గుర్తించాం. గుణాత్మక విద్యకు పెద్ద పీట వేస్తూనే కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిషు మీడియం చదువులు అందుబాటులోకి వచ్చాయి.

– ఎం.లక్ష్మీనారాయణ, టీచర్, జెడ్పీహెచ్ఎస్, పుల్లలచెరువు

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న కండక్టర్



పెద్దల సమక్షంలో నాగలక్ష్మికి పర్సు, నగదు అందిస్తున్న కండక్టర్

కంభం: బస్సులో దొరికిన నగదును తిరిగి ప్రయాణికులకు అందించి కండక్టర్ శంకర్ నాయుడు తన నిజాయితీ చాటుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. కంభం నుంచి పాపినేనిపల్లికి వెళ్లే బస్సులో పాపినేనిపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే మహిళ ప్రయాణిస్తూ పర్సు మర్చిపోయి దిగి వెళ్లిపోయింది. పర్సును గమనించిన కండక్టర్ ఆ విషయాన్ని ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లారు. నాగలక్ష్మి వివరాలు సేకరించి గ్రామ పెద్దల సమక్షంలో పర్సును, అందులో ఉన్న రూ.22 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా కండక్టర్‌ను గ్రామపెద్దలు, తోటి డ్రైవర్లు, కండక్టర్లు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

చీమకుర్తి: జిల్లాస్థాయిలో నిర్వహించిన కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీకి చెందిన క్రీడాకారిణులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కాలేజీ డైరెక్టర్ భాస్కర్ పటేల్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులు ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కర్నూలులో జరిగే కబడ్డీ పోటీల్లో, వచ్చే నెల 8 నుంచి 10వ తేదీ వరకు అనంతపురంలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారిణులను డైరెక్టర్‌తో పాటు కాలేజీ అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ట్రిపుల్ ఐటీ డైరెక్టర్



బాధ్యతలు చేపట్టిన భాస్కర్ పటేల్

చీమకుర్తి: జిల్లాకు చెందిన ట్రిపుల్ ఐటీ కాలేజీ నూతన డైరెక్టర్‌గా భాస్కర్ పటేల్ శుక్రవారం కాలేజీలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా పనిచేసిన జయరామిరెడ్డి పదవీ కాలం పూర్తి కావడంతో ప్రభుత్వం భాస్కర్ పటేల్‌ను నూతన డైరెక్టర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కాలేజీ అధ్యాపకులు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భూ దందాపై చర్చకు సిద్ధం

- దళితుల భూమి మీకు అనువంశికంగా ఎలా వస్తుందో చెప్పగలరా?
- టీడీపీ నేతలకు ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణమోహన్‌రెడ్డి, పక్కన మున్సిపల్ చైర్మన్ కృష్ణ

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో భూ దందాపై శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో పాత్రికేయుల సమక్షంలో టీడీపీ నేతలతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు, మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ నేతలకు దమ్ముంటే తేదీ ప్రకటించి చర్చకు రావాలని సవాల్ చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి చేసిన ఆరోపణలపై ఆయన శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబర్ 1119 దళితుల భూమి అని, ఆ భూమి కందుల నారాయణరెడ్డి కుటుంబ సభ్యులపై అనువంశికంగా ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, తహసీల్దార్‌కు అందించిన రికార్డుల్లో అనువంశికంగా పేర్కొన్నారనీ, దళితుల భూమి ఎలా అనువంశికంగా వస్తుందో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. రామిరెడ్డి ఎవరినో తీసుకొచ్చి ప్రెస్‌మీట్‌లో కూర్చోబెట్టి మాట్లాడిస్తే ఎలా అని ప్రశ్నించారు. తనపై కందుల రామిరెడ్డి ఇష్టారీతిగా మాట్లాడిన మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. సన్‌షైన్ ఇన్‌ఫ్రా కంపెనీలో తాము తీసుకున్న రుణం చెల్లించలేదని ఆరోపణ చేశారని, అందులో తమ ఆస్తులు తాకట్టు పెట్టామని పేర్కొన్నారు. మీ కుటుంబ సభ్యులు కూడా రుణం తీసుకున్నారని, ఆ విషయం మర్చిపోరాదని రామిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. భూ దందాలపై తాము ఎప్పటినుంచో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేస్తున్నా టీడీపీ నేతలు ముందుకు రాలేదని, ఇప్పటికీ చెన్నకేశవస్వామి గుడిలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ తమ కుటుంబంపై ఇష్టారీతిగా ఆరోపణలు చేసినప్పుడే బహిరంగ చర్చకు సవాల్ విసిరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆధారాలతో సహా వస్తే జర్నలిస్టుల సమక్షంలో చర్చించేందుకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ప్రజలకు ఆరోజున ఎవరు భూ కబ్జాలకు, భూ దందాలకు పాల్పడ్డారో స్పష్టంగా తెలుస్తుందన్నారు. తాము ఆర్యవైశ్యుల ఆస్తులను కబ్జా చేసినట్లు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చెన్నకేశవస్వామి గుడిని రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, అది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా, ఇన్‌చార్జిగా చెన్నకేశవస్వామి గుడి అభివృద్ధికి రామిరెడ్డి సోదరుడు ఏం చేశాడో ప్రజలకు తెలుసని, ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదన్నారు. ఆలయ అభివృద్ధికి వారు ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదన్నారు. 70 ఏళ్లనుంచి మార్కాపురంతో పాటు కొండేపల్లి గ్రామంలోనే ఉన్నామని, తమ తండ్రి కొండారెడ్డి ఐదు దఫాలుగా ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారన్నారు. సుమారు 50 ఏళ్లుగా తమ కుటుంబం రాజకీయాల్లో ఉందని, పశ్చిమ ప్రకాశంలో తమ కుటుంబం, కందుల కుటుంబం గురించి అడిగితే ప్రజలే సమాధానం చెబుతారన్నారు. పెద్దారవీడు మండలం నుంచి వచ్చి స్థానికంగా ఉంటున్న తమను స్థానికులు కాదని విమర్శించడం మానుకుంటే మంచిదని హితవు పలికారు. అబద్ధాలు చెబితే ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకమన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు బూదాల సతీష్, రహ్మతుల్లా, ఉత్తమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చకు సిద్ధమే..

మార్కాపురం నియోజకవర్గంలో భూ దందాలపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ నేత కందుల రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. సర్వే నంబర్ 1119లో ఉన్న 20 ఎకరాల పొలాన్ని తమ పెద్దలు మల్లారెడ్డి, ఒంటేరు పెద్ద వెంకటయ్య, చిన్న వెంకటయ్య నుంచి కొనుగోలు చేశారని చెప్పారు.

పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు



స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఓటర్ల జాబితా సవరణపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. క్లెయిమ్‌ల పరిష్కారంలో నాణ్యత ఉండాలని సీఈసీ సూచించగా ఆ మేరకు జిల్లాలో తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో 32 వేల క్లెయిమ్‌లు పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. కలెక్టరేట్‌లో ఒక్కో సెక్షన్‌కు రెండు నియోజకవర్గాలకు సంబంధించిన క్లెయిమ్‌లను పరిశీలించే బాధ్యత అప్పగించామన్నారు. పీఎస్ఈ/డీఎస్ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై ఎన్నికల ప్రధాన అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతుమాధవన్, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం

ఒంగోలు టౌన్: లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా నేటి నుంచి డిసెంబర్ 22వ తేదీ వరకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు ఒక కార్యక్రమం ప్రకారం నాలుగు వారాలపాటు నాలుగు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, వారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో గ్రామ, మండల స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటివారం ప్రచారంలో భాగంగా శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు జెండర్ వయలెన్స్‌పై ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 2 నుంచి 8వ తేదీ వరకు బాల్య వివాహాలు, 9 నుంచి 15వ తేదీ వరకు రక్తహీనత, 16 నుంచి 22వ తేదీ వరకు ఆడపిల్లల విద్యపై ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు. శనివారం కేంద్ర ప్రభుత్వం పర్వ్చువల్‌గా ప్రారంభించే ఈ కార్యక్రమంలో ఏసీలు, ఏపీఎంలు, సీసీలు, వీఏఓలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొని వీక్షించాలని పీడీ కోరారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వరికూటి

టంగుటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, సతీమణి లక్ష్మి, కుమారుడు గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కొండపి నియోజకవర్గంలోని పార్టీ పురోభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని వరికూటి తెలిపారు.



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వరికూటి, కుటుంబ సభ్యులు

వివాహిత అనుమానాస్పద మృతి



అంబులెన్స్‌లో సుష్మ మృతదేహం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: భర్తతో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం సింగరాయకొండ మండలంలోని శానంపూడి పంచాయతీ మాలపల్లె పల్లుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శానంపూడికి చెందిన శ్రీకాంత్‌కు జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన పెనుమల్లి సుష్మ(23)తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. అయితే ఏడాది కాలంగా శ్రీకాంత్ మరో మహిళతో అక్రమ సంబంధం నెరుపుతూ నెల్లూరులో కాపురం పెట్టాడన్న విషయం తెలియడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా వారి మధ్య గొడవ జరిగిందని, గదిలో పడుకున్న సుష్మ ఎంతకూ బయటకు రాకపోవటంతో శ్రీకాంత్ తలుపుతీసే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేక కిటికీ అద్దం పగలగొట్టి చూడగా ఉరివేసుకుని చనిపోయింది.

స్థానికులు మాత్రం శుక్రవారం ఉదయం సుష్మ, శ్రీకాంత్ గొడవపడ్డారని ఆ సమయంలో సుష్మ చీరలో ఉందని, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నైటీలో ఉన్న సుష్మను ఆమె భర్త శ్రీకాంత్, మరిది శశి ఇద్దరూ బైక్‌పై ఎక్కించుకుని సింగరాయకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె చనిపోయిందని చెప్పడంతో తిరిగి ఇంటికి అంబులెన్స్‌లో తీసుకొచ్చారని తెలిపారు. సుష్మ బంధువులు శ్రీకాంత్‌పై దాడి చేయడంతో పోలీసులకు లొంగిపోయాడని, సుష్మను అతనే చంపేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్ పరిశీలించారు. మృతదేహానికి తహసీల్దార్ సీహెచ్ ఉష పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త శ్రీకాంత్, అత్త సీత వేధింపుల కారణంగా సుష్మ మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వస్తే వాస్తవాలు తెలుస్తాయని ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్ల విజయం



విజేతలుగా నిలిచిన బాలికల జట్టు



విజేతలుగా నిలిచిన బాలుర జట్టు

కనిగిరి రూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో అండర్–19 పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు విజయకేతనం ఎగురవేశాయి. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 67వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. జిల్లా బాలికల జట్టు లీగ్ దశలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లా జట్లపై గెలిచింది. క్వాటర్ ఫైనల్స్‌లో చిత్తూరుపై, సెమీఫైనల్స్‌లో విశాఖపట్నంపై విజయం సాధించింది. ఫైనల్స్‌లో తూర్పు గోదావరి జిల్లాపై 8–2 తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచి కప్పును కైవసం చేసుకుంది. అలాగే బాలుర జట్టు లీగ్ దశలో కడప, గుంటూరు జిల్లాల జట్లపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లో తూర్పు గోదావరి జిల్లా, సెమీ ఫైనల్స్‌లో విశాఖపట్నం జిల్లాపై విజయం సాధించింది. ఫైనల్స్‌లో విజయనగరంపై 21–16 తేడాతో గెలిచి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. విజేతలుగా నిలిచిన జిల్లా బాలబాలికల జట్లను శుక్రవారం జిల్లా డీఐఈఓ ఐ.శ్రీనివాసరావు, ఆర్ఐఓ సైమన్‌విక్టర్, ఖోఖో సంఘ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారాంరెడ్డి, అండర్–19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి, కోచ్, మేనేజర్లు కే హనుమంతరావు, వి.రఘుబాబు, వై.శ్రీనివాస్‌రెడ్డి, కే పేరిరెడ్డి, ఎంఎల్ఎస్ కావ్య అభినందించారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

- మూడు రోజులుగా సరాసరి వర్షపాతం 32.6 మిల్లీమీటర్లు



ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం

ఒంగోలు సెంట్రల్: జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలోని 38 మండలాలకుగానూ 37 మండలాల్లో మూడు రోజుల నుంచి సరాసరి వర్షపాతం 32.6 మిల్లీమీటర్లు నమోదైంది. గురువారం సైతం పుల్లలచెరువు మండలం తప్ప మిగిలిన అన్ని మండలాల్లో వర్షాపాతం నమోదైంది. గురువారం వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. టంగుటూరు 29.2 మిల్లీమీటర్లు, కొత్తపట్నం 26.2, ఎస్.కొండ 25.6, జరుగుమల్లి 18.4, వెలిగండ్ల 18.4, ఎన్‌జీ పాడు 17.4, కొండపి 14.2, ఎస్ఎన్ పాడు 12.4, యర్రగొండపాలెం 10.2, పొన్నలూరు 10, పీసీపల్లి 9.8, ఒంగోలు, పొదిలి 9.2, దోర్నాల 8.2, మర్రిపూడి 8, మద్దిపాడు 7.2, చీమకుర్తి 5, దొనకొండ 4.6, ముండ్లమూరు 4.2, కురిచేడు 4, తాళ్లూరు, త్రిపురాంతకం 3.2, రాచర్ల 3, కంభం 2.8, మార్కాపురం 2.6, పామూరు, కొనకనమిట్ల, గిద్దలూరు 2.2, దర్శి 1.8, పెద్దారవీడు 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించిన డీఆర్‌ఓ శ్రీలత



ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ఉద్యోగులకు పని ప్రదేశాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, సర్వీసుకు సంబంధించి ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌ఓ ఆర్.శ్రీలత తెలిపారు. స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన భవనంలో శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నెలకు ఒకసారి ఎంప్లాయీస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు అందజేసిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించేలా నిబంధనల మేరకు అవసరమైన ప్రతి అవసరాన్ని తీరుస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏఓ చిరంజీవి, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి రూ.1.17 కోట్లతో అసెంబ్లీ షెడ్

- మంజూరుకు సహకరించిన ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలిపిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఒంగోలు సెంట్రల్: స్థానిక ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చొరవతో ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు షెడ్ నిర్మాణానికి రూ.1.17 కోట్లను కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ మంజూరు చేసినట్లు ఎంపీ కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశ మందిరం లేకపోవడంతో విద్యార్థులు వర్షం, ఎండ సమయాలలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంపీకి ప్రిన్సిపాల్ విన్నవించడంతో ఎంపీ ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్‌కు 2023 మే నెలలో విన్నవించారు. స్పందించి షెడ్ మంజూరు చేయించిన ఎంపీ మాగుంటకు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.